సత్ప్రవర్తనులకే శిక్ష

శ్రీమతి శిరుగూరి రత్నమ్మగారు

౧

షవేజాన్‌పురమందుగల డిస్ట్రిక్ట్ ఇంజనీయరగు శివసింహునియందు చాలమంచిగుణములుండెను. కాని అతనియొక్క న్యాయప్రవర్తనయే ఆయనకు ఒక్కొక్కసారి శత్రువగుచుండెను శివసింహుడు శాంతి ప్రియుడు. మిగుల ఓర్పుగలవాడు ఆకారణములవలన మిగిలినకచేరీయందుగల ఉద్యోగస్థులకు అతడు శత్రువయ్యెను. అతనిశాంతగుణమే తనవశములోగల సేవకులనుగూడ సోమరులను భయములేనివారినిగా చేసెను

ప్రాతఃకాలమున శివసింహుడు ఒకవంతెనను చూచుటకై వెడలదలంచెను కాని గుఱ్ఱపుసైసు ఇంకను నిద్రనుండి లేవలేదు రాత్రి శివసింహుడు వానితో అయిదుగంటలు కాకమునుపే బండితయారుగానుండమని ఎంతయోచెప్పియుండెను కాని ఎంతయో ప్రొద్దెక్కినది ఇంకను వాడులేవనేలేదు.

శివసింహుడు ఎంతయోసేపునిల్చుని సైసుకొరకువేచియుండి విసిగి ఒకకుర్చీలో కూర్చుండెను. చిట్టచివరకు ఎట్లో సైసు మేల్కొనెను కాని నౌకరులింకనూ రాలేదు ఒకనౌకరు టపాతీసుకొనుటకు వెళ్ళియుండెను. మార్గమధ్యమున ఒకదేవాలయమువద్ద ప్రసాదముకొరకు నిల్చునిపోయెను ఇంకొకరు 'ఓవరుసీరియరు'ను పిలుచుటకు వెళ్ళిత్రోవలో గంజాయిపీల్చుచు గూరుచుండెను ఎండఎక్కువగుచుండెను అప్పుడు శివసింహుడు విసుగుకొనుచూ తనభార్యయగు రమాదేవిదగ్గరకువెడలి "రమా! ఎంతప్రొద్దెక్కినదో చూచితివా? ఇంతవరకూ ఒక్కపరిచారకుడునురాలేదు నాకు ఈనవుకరులవలన ప్రాణము విసిగిపోవుచున్నది"

భార్యగోడవైపుజూచుచు "నీచులకు చనువొసంగిన ఏమగును?" అని అనెను

శివసింహుడు మరింతకోపముతో "అట్లయిన ఏమిచేయుమందువు? వారిని వురిదీయుమందువా?"

౨

ఇంజనీయరువద్ద మోటారుగాని, ఫీటనుగానిలేవు. అతని కొక ఎక్కాబండికలదు. దానితోనే అతడు తృప్తిచెందుచుండెను పరిచారికాజనము ఎక్కాబండిని విమానమని చెప్పుచుందురు ఊరిలోజనులందరు దానిని విమానమని చెప్పుటకంటె ఎద్దుబండిఅనిచెప్పిన ఎంతయో ఒప్పియుండునని అనుచుందురు ఈమాదిరిగా శివసింహుడు తనవ్యవహారములన్నియు మితవ్యయముతోనే చేయుచుండువాడు ఆయనకు ఇద్దరన్నదమ్ములు అలహాబాదులో చదువుకొనుచుండిరి తల్లి కాశీనివాసముచేయుచుండెను. ఒకవితంతుసోదరినిగూడ శివసింహుడే పోషింపవలసివచ్చెను ఈ పరివారముకాకుండ కొంతమంది బీదబాలురకుకూడ ఆయనఅన్నము పెట్టుచుండెను. ఈకారణములవలన శివసింహునివద్ద నెలాఖరగుసరికి ఒకరాగిపైసఅయిననూ వుండునదికాదు. ఆయనబట్టలు చాలవిలువ తక్కువగలవే! కాని ఆయన ఎన్నికష్టములు పడుచున్ననూ లాభమును దగ్గరకురానిచ్చువాడు కాడు తనస్నేహితులందరు ఆయనను ఒకదేవతగా భావించుచుందురు

శివసింహునియొక్క ఈసత్ప్రవర్తన అతనికేమియు హానికలిగింపకున్నను అతనిక్రిందివారికిమిగుల హానికారకమై యుండెను. చివరకు రమాదేవికూడ అప్పుడప్పుడుఆతనిపై విసుగుకొనుచుండెడిది.

ఒకనాటిసాయంకాలమున శివసింహుడు ఆఫీసునుండి ఇంటికివచ్చెను రమాదేవియాతనితో "లోకమంతయూ మీసత్ప్రవర్తనను నిందించుచుండెను. మీకు దీనివలననేమిప్రయోజనము?"అనెను.

శివ:—ప్రపంచమంతయు తిట్లనుకొనినను సరియే! పైనభగవంతుడు చూచుచున్నాడు

రమా:—నేను మీతోవాదించుటకు చెప్పుచుండుటలేదు మీ ఈసత్ప్రవర్తన తక్కినవారలకు ఎట్లు కష్టదాయి అగుచున్నదో మీరొకసారి యోచించిచూడుడు. మీకు చేతినిండుగ జీతముదొరకుచున్నది. మీరు

రెండవ వారిని చేయిచాచి అడుగనక్కరలేదు కాని స్వల్పవేతనములపొందు గుమస్తాలు, సేవకులు తమజీవనములనెట్లు గడపుకొనగలరు? వారలకుగూడా పిల్లలుగలరు వారలెట్లువివాహాదికము లొనర్పగలరు? ఇప్పుడే రామదీనునియొక్క భార్యవచ్చి ఏడ్చిఏడ్చివెళ్ళినది పిల్ల పెద్దదైనదట. పెండ్లిచేయవలయును. బ్రాహ్మణజాతి. అనేకమగుఖర్చులు పాపము. వాళ్ళెక్కడనుండి తెచ్చిపెట్టగలరు? ఆమెఏడ్చినఏడ్పు ఎవరికితగులును?

శివ.—ఇదియంతయు నిజమే! కాని లంచములు పుచ్చుకొనుట శివసింహునికి చాల అనంగీకారమగు పని. నీవు చెప్పినదియు నిజమే! కాని నేనేమిచేయగలను? నావశములో ఏమున్నది? నానియమములను ఎట్లు ఉల్లంఘింపగలను? వారి జీతములు ఎక్కువచేయుట నావశములో ఉన్నట్లయిన తప్పక ఎక్కువచేసియుందును. కాని నేను దోపిడిచేసి వారలచేగూడ దోపిడీచేయించనా?

రమాదేవి వ్యంగపూర్వకముగా "అయితే ఈఉసురు ఎవరిమీదవచ్చి పడుతుంది?" అన్నది.

శివసింహుడు ఒకనిట్టూర్పువిడచి "ఎవరైతేఆదాయముకంటె వ్యయము ఎక్కువగాచేయుచున్నారో వారలమీదనే పడుచున్నది బీదవారలయిఉండియు ఏలపెద్దపెద్దకుటుంబములవారితో వివాహాది సంబంధము లొనరింపుచుండవలెను? నాసైసుయొక్కభార్య మెడయందు వెండితోనింపుకొనవలెనని కోరిన అది ఎవరిది తప్పు? ఈ అనవసరపువ్యయములకన్నిటికి నేనాఉత్తరదాతను?

3

పూవులతోటకు తేనెటీగలకు ఎంతసంబంధమున్నదో అంతసంబంధము ఇంజనీయరుకును కంట్రాక్టుదారులకుగలదు పూవులనుండి తేనెనుఈగలు ఎట్లునిరాటంకముగా గ్రహింపగలవో అట్లే ఇంజనీయరులును గ్రహింపగలరు ఈమధురసమును కమీషనని చెప్పుదురు లంచమునకు, కమీషనుకు చాలాభేదమున్నవి. లంచము ఇహలోకపరలోకములకు సర్వనాశనముచేయును లంచముతీసికొనినవారిని దొంగలనియు, చెడ్డపేరు గలవారనియు చెప్పుదురు కాని కమీషను మనోహరమైన ఉద్యానవనమువంటిది. అచట మనుష్యులయొక్క గాని భగవంతునియొక్క కాని భయములేదు కమీషనునైపు చెడ్డపేరు కండ్లెత్తిఅయిన చూడజాలదు. ఇట్లయినప్పటికి శివసింహుడు తనయొక్క ఉజ్వలమైన చరిత్రను ఈకళంకమునుండి దూరముగానుంచెను

మార్చినెల గడచుచుండెను చీఫ్ఇంజనీయరుజిల్లాలోతనిఖీచేయుటకు వచ్చుచుండెను. కాని ఇంకను కొన్నిభవనములు తయారుకాలేదు. రోడ్లన్నియుపాడైయుండెను. కంట్రాక్టుదారులు పనిని ప్రారంభింపనే లేదు శివసింహుడు ప్రతిరోజు కంట్రాక్టుదారులకు కఠినముగా ఆజ్ఞాపించుచుండెను, కాని ఫలమేమియు అగుపడకుండెను

ఒకరోజున శివసింహుడందరిని పిలిపించి ఇట్లుచెప్పెను "నేను ఈజిల్లానుండి చెడ్డపేరుసంపాదించి వెళ్ళలెననిమీరందరూ కోరుచున్నారా? నేను మీఎడల ఎవ్వరియందునను చెడ్డగాప్రవర్తించలేదే! నేనే మీకు నష్టముకలిగించవలెననికోరిన మీకు కంట్రాక్టుకుఇవ్వక నేనే స్వయముగ కూలీలనుపెట్టి చేయించుకొనగలను. కాని మీకు నష్టముకలిగించవలెనని నాకోరిక కాదు. సరియే! మంచిది. మీకు నష్టము కలిగించనందుకు నాకేశిక్ష కలుగుచున్నది"

కంట్రాక్టుదారులందరు ఏమియుజబాబియ్యక తలలువంచుకొని నిల్చుండి కొంచెముసేపటికి సెలవుదీసికొనిపోయిరి. మార్గములో వారిట్లు మాట్లాడుకొనసాగిరి

గోపాలదాసు—ఇప్పుడు సంగతంత బోధపడుతుంది.

షహిబాజఖాన్—ఏదో ఒకప్రకారంగా ఈయన ఇచ్చటనుండి పోవలయును.

చున్నీలాలు—నాకు చీఫ్ఇంజనీయరుగారితో చాలస్నేహము. నేను వారిదగ్గర పనిచేసితిని. వారు ఆయనను ఇప్పుడు బాగాచివాట్లుపెట్టగలరు.

ఇంతలో ముసలివాడగు హరిదాను ఇట్లుచెప్పెను "మిత్రులారా! స్వార్థముసంగతి యట్లుంచుడు. శివసింహుడు దేవతకాని మనుష్యుడుకాడు అతను దేవతయేకానియెడల సంవత్సరమునకు పదివేలరూపాయిల కమీషను వదులుకొనునా? ఇన్నిరూపాయిలను చిల్లపెంకులవలె తుచ్ఛమని తలచుట సహజమగుసంగతియా? ఇక మనమా! ఒకగ్రుడ్డిగవ్వకోసరము మనమమ్మకం అమ్ముకొనుచున్నాము ఈసజ్జనుడు మనదగ్గరనుండి ఒక చిల్లిగవ్వఅయిన కోరుటలేదు ఎన్నికష్టములువచ్చి నప్పటికి తననీతిపథమునుండి విచలితుడుకాలేదు. అతనితో మనము నీచముగాను, కుటిలముగాను ప్రవర్తించుచున్నాము"

షహిబాజ్—ఈతనొకగొప్పదేవదూతయని చెప్పుటకు ఏమియు నభ్యంతరములేదు

చున్నీలాలు—నీవు చెప్పినది సరియే! కాని ఏమిచేయగలము? సత్ప్రవర్తనవలన పనిలేదు. ఈప్రపంచము కపటము, మోసము వీనితో నిండియున్నది

గోపాలదాస్—అతను అట్లున్యాయముగా ప్రవర్తించవలెనని కోరితే ఉద్యోగమెందుకు చేయవలెను? తమయొక్క ప్రవర్తనను న్యాయముగా ఉంచుకొనవలెనని ఎవరికితెలియదు? తను అట్లున్నయెడల రెండవ వారికి ఎంతఇబ్బంది కలుగునో ఆలోచించవద్దా? ఎవడైతే తాను తినుచు, ఒకరికి పెట్టునో అటువంటి వాడే మనకుకావలెను. ఎవడైతే ఒకరూపాయిఅయినా కమీషను తీసికొంటాడో వాడే తక్కినవారికికూడా సదుపాయముచేసినవాడు. ఈమహాశయునివద్ద అటువంటిది ఏమిటిఉన్నది? మీఇష్టమొచ్చినట్లు మీరుచేయుడు. నేను మాత్ర మతనిదగ్గర నిర్వహించలేను

షహిబాజ్—మంచివాడుగను, నిర్మలమైన మనస్సుగలవాడుగను ఉండుట మంచిదే! కాని ఆమంచితనము రెండవవారి ప్రాణములుతీయుటా?

ప్రతివారును వృద్ధహరిదాసుమాటలయందు నిరాదరమును, గోపాలదాసునియందు ఆదరమునుచూపిరి. నిర్మలమైన ఆత్మకలవారియందు నిజముయొక్క ప్రకాశము మిణుగురుపురుగువంటిది.

౪

శివసింహునికి ఒకకుమార్తెకలదు ఆమెయొక్క వివాహము ఒకవకీలుకుమారునితో నిశ్చయమయ్యెను. పిల్లవాడు చాలబుద్ధిమంతుడు మంచిసంప్రదాయమైన కుటుంబమునకు చెందినవాడు. శివసింహుడు చాలరోజులక్రిందటనే ఎంతయో కష్టముమీద వివాహము నిశ్చయముచేసెను కేవలము వరదక్షిణయే ఇంకను నిశ్చయముకాలేదు మొదట వకీలు జిల్లాఇంజినీయరుగారితో వరదక్షిణగురించి నిశ్చయము చేసు కోవడము వృథాఅని అనుకొనెను. కాని క్రమముగా ఇంజనీయరుగారి సంసారస్థితి తెలసెను అప్పు డతను శివసింహునితో వరదక్షిణ నిశ్చయము చేసుకొనవలయునని తలంచి వరశుల్కమునుగురించి ఇంజనీయరుకు జాబువ్రాసెను దానిని చూడగనే శివసింహుడు ఒక పెద్దనిట్టూర్పువుచ్చెను. అతనియొక్క ఆశలన్నియు మట్టితోకలసిపోయెను వికలుడై గదియందిట్లట్లు పచారుచేయసాగెను తరువాత కొంచెముసేపటికి లేచి ఆఉత్తరము చేతితోపట్టుకొని వెళ్ళి రమాదేవికి చూపింపదలంచెను కాని అచట ఆమె సహానుభూతి చూపింపదుకదాయని అనుకొనెను.

శివసింహుడు స్వాభావికముగా మిక్కిలి దయకలవాడు కోమలహృదయులు ఆపదలయందు స్థిరముగా నుండజాలరు అతను విచారముతో నిండినమనస్సుతో ఒకకుర్చీలోకూలబడి ఇట్లాఆలోచించుకొనసాగెను. "నేను ఎటువంటి పాపముచేసితిని? నాకిట్టిఫలము ఏలకలుగుచున్నది? ఎన్నియోసంవత్సరములు పనిశ్రమచేసి

చేసినిశ్చయించిన వివాహము ఒక్కక్షణములో భగ్నమయ్యెను వారడిగిన కట్నమిచ్చుటకు నాకు వశము కాదు. నేను దాని నొసంగజాలను. నాలుగువైపులను అంధకారముగానున్నది ఎవరును నాకు సాయము చేయువారులేరు” శివసింహునికండ్లు జలపూరితములయ్యెను

ఎదుట బల్లమీద కంట్రాక్టుదారులయొక్క బిల్లులుఉండెను అవి ఎన్నియొ వారములనుండి అక్కడే పడియుండెను శివసింహుడు వానిని విప్పిఅయినను చూడలేదు. నేడు ఈచింత, నిరాశఅవస్థలో అతను వానిని సతృష్ణనయనములతో చూడసాగెను

“కొంచెము పరిశ్రమచేసిన ఈకష్టములన్నియు దూరమైపోవును నవుకరులు, గుమస్తాలు నాయొక్క సమ్మతిపై ఆధారపడి సమస్తమొనరించెదరు నేను పెదఘకదప నక్కరలేదు. నేను లజ్జింప నక్కరలేదు” అంత నాతడు బిల్లులనెత్తి ఎంత ఆదాయమైనదో కూడసాగెను. కాని వెంటనే వాని ఆత్మ వానిని మేల్కొల్పెను “అయ్యో! నేనెట్టి భ్రమలోపడితిని. నాజన్మమంతయు గడించిన ఈనిర్లోభమును కేవలము కొంచెము ధనముకొరకు అర్పించెదనా? నేను నాసహచరులఎదుట గర్వముతో తలఎత్తి తిరుగుచుంటినే! చలనహేతుశకటాసీనులగు నాసోదరులు ఎందువల్లనైతే నన్ను కన్నెత్తి చూడజాలరో, ఆ నేను నాగౌరవమును, మాన్యతను నాసంపూర్ణ ఆత్మికసంపత్తిని పది,అయిదువేల రూపాయిలకొరకు అర్పించనా? అట్లెన్నటికిని కాజాలదు ఛీ! ఛీ!! అటువంటిది మనమున యోచించుట గూడ మిగులపాపము

శివసింహు డాబిల్లులనెత్తి బల్లక్రింద బడవైచి కాలితోత్రొక్కెను. అప్పుడు విజయముపొందిన శివునివలె లోపలకు వెడలెను

౨

పెద్దఇంజనీయరు సరియగు సమయమునకు షవేషజాన్‌పురమునకు వచ్చెను అతనితో గూడా శివసింహుని దౌర్భాగ్యముకూడా వచ్చినట్లయ్యెను జిల్లాలోపని అంతయూ సగముసగముగా నుండిపోయెను. ఒక సేవకుని దొర “ఏమి పనిఅంతాఇట్లున్నది?” అని అడిగెను

“హుజూర్! ఏమనిచెప్పను? పని ఎట్లు పూర్తికాగలదు? ఇంజనీయరుగారు కంట్రాక్టుదారులను చాల కష్టపెట్టుచున్నారు పెద్దగుమస్తా ఆఫీసులెక్కలు తప్పులు తప్పులుగా నుండుట చూచినాడు. ఆయన సరిగా పని చూచుటలేదు ”అని ఆతడుచెప్పెను

ఇంతలో జిల్లాలోని కంట్రాక్టుదారులు ఒక విలువగల పూలసజ్జనుదెచ్చి పెద్దఇంజనీయరుకు బహుమతి చేసి ఇట్లుచెప్పిరి “హుజూర్! మీరు గుండువేశి చంపిననూ సరియే! కాని శివసింహుని అన్యాయము సహింపజాలకున్నాము చెప్పడంమట్టుకు కమీషను పుచ్చుకొనడని అందురు కాని మాప్రాణములు తీశివేయుచున్నారు” దొర తన తనఖాపుస్తకములో ఇట్లువ్రాసెను “శివసింహుడు చాల నమ్మకమైనమనిషి. అతనియొక్క చరిత్రకూడ ఉజ్వలమైనదే! కాని అతను ఇంతగొప్పజిల్లాలో పనిచేయుటకు అసమర్థుడు.”

దానియొక్క ఫలమేమైనదంటే అతను అచటనుండి చిన్నిజిల్లాకు మార్పబడెను. అతనియొక్క హోదాకూడా తగ్గింపబడెను

శివసింహుని యొక్క స్నేహితులు ఒక గొప్పవిందుఉత్సవముచేసిరి ఆఉత్సవమందు శివసింహుని యొక్క ధర్మనిష్ఠనుగురించి చాలా ప్రశంసించిరి సభాపతి కన్నీళ్ళతో ఇట్లుచెప్పెను: “శివసింహుని వియోగదుఃఖము మనలను ఎల్లప్పుడు వేధించును ఈచింతమానదు ఈగాయము ఎప్పటికి మానదు.”

ప్రయాణం నిశ్చయమయ్యెను. ఉత్సవమునుండి ఇంటికిరాగానే వానియొక్క ముఖము మలినముగా నుండుట రమాదేవి చూచెను. ఆమె అతనితో మాటిమాటికి “పెద్దఇంజనీయరుకు ఏమైనబహుమతీ ఈయుదురు

అతని 'బట్లరు'కు ఏమైనా ఇనాముఇందు హెడ్డుక్లార్కుకు విందొసంగుడు " అని చెప్పుచుండెను. కాని శివసింహుడు ఒకటిగూడ వినుపించుకొనలేదు

ఎప్పుడైతే రమాదేవి ఇతనియొక్క హోదాతగ్గుటయూ బదిలీయూ వినెనో అప్పుడామె భర్త కెంతయో బోధించెను కాని ఈసమయమందు కూడ శివసింహు డుదాసీనుడుగా నుండుటచూచి ఆమె ఇక సహింపలేకపోయెను. అతనిని ఇట్లుఅడిగెను "ఏమిఅట్లు ఉదాసీనులుగా నుంటిరి?"

"ఏమిచెయ్యమంటివి? నవ్వమంటివా?"

"ఆ! నవ్వక ఇంకేమిచేయుదురు? ఎవరైతే గుడ్డిగవ్వకొరకు ఆత్మభ్రష్టత్వము చేశిరో, ఎవరురూపాయిలకొరకు తమధర్మమును నష్టపరచిరో వారికి ఇట్టి నష్టము కలిగిన వారేడ్వవలయును. ఇది చెడుప్రవర్తనకు శిక్షకాదు సత్ప్రవర్తనకే శిక్ష! దీనిని ఆనందముతోనే యనుభవింపవలయును "

ఇట్లుచెప్పి రమాదేవి తనభర్తవైపు చూచెను వాని నేత్రములలో నిజమగు అనురాగము కనిపించెను. శివసింహుడు అనురాగపూరితహృదయముతో రమాదేవిని ఆలింగనమొనర్చుకొని "ప్రియా! రమా! నాకు నీయొక్క ఈయొక్క సాహానుభూతియే కావలెను నేనీదండనను సంతోషముగా ననుభవించెదను " అనెను.

(అనువాదము)

భాగ్యరేఖ

సీరిపి ఆంజనేయులు గారు

నియతిమెయిఁ బదునాఱువన్నియలు గడవఁ
బుటముపయిఁబెక్కుపుటములుపొదలు కొలిపి
రాపుశులమేల్మెఱుంగు దుఱంగలింపఁ
గనకముఁగరంచు లోహకారుని తెఱంగు,
తొల్త లేవడిమున్నిటఁ దోఁగఁజేసి,
కడిఁదిదైన్యాగ్నిఁబయిఁబయిఁగ్రాఁచికాఁచి
యాయుమానానఁ గ్రొంగ్రొత్తయాపదలును
నాపదలలో నమేయంపుటామయములు
వెలయ, ననిశంబునలయించి వెతల నొంచి,
జనక! నీదయాగరిమాతిశయము, నాకు
బోధసేయుచునుంటి వపూర్వఫణితి;
నేమి నాభాగ్యరేఖయో! యెఱుఁగరాదు.

అశ్రువులు

కస్తూరి రాజామాణిక్యము గారు, [సారస్వతసమాజము]

ఇది తమోనీలయామిని,—ఈతమస్సు
తెఱలువడకెడి చలిగాలితఱగలందు;
కలతవెలుగులలో తారకలులయించు;
ప్రాముకొన్నది గంభీరమధురశాంతి
అక్కటకట!
ఊరకే జలధారల హోరుమనుచు
ఏడ్చి,యేడిచి, అలసిపోయునది బ్రతుకు—
శ్రావణవినీల జలధరస్వామివోలె.
కడచిపోయినరోజులు కదపి,కదపి,
కష్టగాథల నంతస్సు కలచి,కలచి,
స్మృతిపథమ్మున ఆఱనిచిచ్చులుమిసి,
ఇదియెదోకాని, లోన దహించుకొనును;
భగ్నహృదయుని నిఱుపేదబ్రతుకులోన
ఈమహాబాధ నిదురలేచినది నేడు—
కలవరములేని యీనిశాగర్భమందు
అలసినిద్రిలి యెచటనో అణగియున్న
హృదయదుఃఖాల నెవరోయిరేపినారు?—